# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు.
- ❖ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ ప్రాంతంలో ఈరోజు మధ్యాహ్నం పర్యాటకుల బృందంపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇప్పటివరకు 25 మందికి పైగా మరణించారు.
- ❖ రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులదే అంతిమ నిర్ణయమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ❖ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ UPSC సివిల్స్ 2024 తుది ఫలితాలను ఈరోజు ప్రకటించింది.
- ❖ వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేసుకున్నాయని జేడీ వాన్స్ తెలిపారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు ఉదయం సౌదీ అరేబియా చేరుకున్నారు. సౌదీ గగనతలంలోకి ప్రవేశించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానానికి రాయల్ సౌదీ వైమానిక దళానికి చెందిన F-15 యుద్ధ విమానాలు వినూత్న స్వాగతం పలికాయి. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు నరేంద్ర మోదీ ఆ దేశంలో పర్యటించడం ఇది 3వ సారి. అరబ్ న్యూస్ కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... సౌదీ అరేబియా భారత్ కు విశ్వసనీయమైన మిత్ర దేశమని పేర్కొన్నారు. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ నాయకత్వాన్ని విజన్ 2030 చొరవను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ప్రతిపాదిత భారత్ – మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ప్రధానమంత్రి ప్రస్తావించారు.

=======================

దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ ప్రాంతంలో ఈరోజు మధ్యాహ్నం పర్యాటకుల బృందంపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో ఇప్పటి వరకు 25 మందికి పైగా మరణించారు. గాయపపడిన వారిని జిల్లా వైద్య కేంద్రానికి తరలించారు. దుండగులను పట్టుకునేందుకు భద్రతా దళాలు ఆ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడి దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని సూచించిన ప్రధానమంత్రి... తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని చెప్పారు.

=======================

రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులదే అంతిమ నిర్ణయమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన ఢిల్లీ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ... ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎల్లపుడూ జవాబుదారీతనంగా ఉండాలని అన్నారు. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనదని రాజ్యంగంలో ఎక్కడా లేదని పార్లమెంటే అత్యున్నతమైందని జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ UPSC సివిల్స్ 2024 తుది ఫలితాలను ఈరోజు ప్రకటించింది. మొత్తం 1,009 మంది అభ్యర్థులను ఫలితాల జాబితాలో వెల్లడించగా వారిలో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. తొలి 25 మంది అభ్యర్థులలో 11 మంది మహిళలు 14 మంది పురుషులు ఉన్నారు. శక్తి దూబే ఈ సంవత్సరం మొదటి స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 11 సెకన్లు)

=======================

అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వాన్స్ భారత పర్యటన కొనసాగుతోంది. వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేసుకున్నాయని జేడీ వాన్స్ తెలిపారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డొనాల్డ్ ట్రంప్-నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఇది కీలక అడుగని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి ఇది రోడ్ మ్యాప్‌గా మారనుందని జేడీ వాన్స్ పేర్కొన్నారు. భారత్ అమెరికా బంధాన్ని బలోపేతం చేసుకోవడానికే ఇక్కడకు వచ్చామని అమెరికాతో పాటు భారత్ కూడా అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారని తెలిపారు. ఇరు దేశాలు శ్రామిక శక్తిని గౌరవించే భాగస్వాములని జేడీ వాన్స్ ప్రసంగిస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

=======================

అమెరికా ఐటీ సంస్థలు భారత్ లో నూతన అవకాశాలను అన్వేషించాలని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. శాన్ ఫ్రాన్సిస్కోలో అనేక దిగ్గజ ఐటీ సంస్థల ప్రతినిధులతో నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. అగ్రశ్రేణి CEOలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కృత్రిమ మేధస్సు (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాలలో అవకాశాలను చర్చించారు.

ఇరు దేశాల మధ్య సాంకేతిక సహకారంతో పాటూ.. పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అన్వేషించాలని వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

=======================

'ఒక దేశం ఒకే ఎన్నిక'పై ఏర్పాటయిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో సమావేశమయ్యింది. 39 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో లోక్‌సభ నుండి 27 మంది, రాజ్యసభ నుండి 12 మంది సభ్యులు ఉన్నారు. మొదటి సమావేశంలో కమిటీ సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ హేమంత్ గుప్తా, బిఎస్ చౌహాన్‌లతో సంభాషించింది. అనంతరం జెపిసి ఛైర్‌పర్సన్ పి.పి.చౌదరి పాత్రికేయులతో మాట్లాడుతూ... జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే జమిలి ఎన్నికలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

=======================

పొగాకు రైతులకు ఉపశమనం కల్పిస్తూ.. కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వర్జీనియా పొగాకు పెంపకందారుల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తో పాటు బార్న్ నిర్వహణ కోసం లైసెన్స్ లను 3 సంవత్సరాలకు ఒకసారి పునరుద్ధరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో  ప్రతి సంవత్సరం పునరుద్ధరించే ప్రస్తుత పద్ధతికి బదులుగా 3 సంవత్సరాల వరకు ఆ ధృవపత్రాలు చెల్లుబాటు కానున్నాయి. పంటల కాల వ్యవధిని ఒకటి నుండి 3 సంవత్సరాలకు పెంచే ఈ సవరణ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలోని దాదాపు 83 వేల 500 మంది రైతులకు లబ్ధి చేకూర్చనుంది. కాగా భారతదేశం ప్రపంచంలోనే 2వ అతిపెద్ద పొగాకు ఉత్పత్తిదారునిగా ఉంటూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, పొగాకు ఎగుమతులు ప్రభుత్వ ఖజానాకు 16 వేల 728 కోట్ల రూపాయలను సమకూర్చాయి.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. రోమ్ నగరంలోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుందని వాటికన్ ఒక ప్రకటనలో తెలిపింది. పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని ప్రస్తుతం శాంటా మార్టా నివాసంలోని ప్రార్థనా మందిరంలో ఉంచారు.

=======================

లక్నో వేదికగా ఈరోజు ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెంట్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న లక్నో సూపర్ జెంట్స్ 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది.

=======================
=======================